సాక్షి చిత్తూరు

సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



ఘనంగా సంకటహర చతుర్థి
కాణిపాక ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. - 8లో



భయపెడుతున్న జీబీఎస్ వైరస్
జీబీఎస్ వైరస్ కేసులు రాష్ట్రంలో నమోదు కావడంతో కలకలం రేగుతోంది. జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. - 8లో



జిల్లాకు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు
ఇంటర్ పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు పకడ్బందీగా పోలీసుల బందోబస్తు నడుమ జిల్లా కేంద్రానికి చేరాయి. - 8లో


చేనేతకు షాక్!



పుత్తూరులో పవర్‌లూమ్‌ మగ్గం

చేనేత, పవర్‌లూమ్స్ కార్మికులు చంద్రబాబు హామీలు నమ్మి నట్టేట మునిగారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం ద్వారా మగ్గం కలిగిన ప్రతి నేతన్నకు ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సాయం అందించింది. అంతే కాకుండా విద్యుత్ చార్జీల నుంచి 96 పైసల యూజర్ చార్జీలను తగ్గించి వెసులుబాటు కల్పించింది. అయితే అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మాత్రం నాటి ఎన్నికల హామీకి ఎగనామం పెట్టడంతో పాటు వివిధ సుంకాల పేరిట విద్యుత్ చార్జీలను పెంచి చేనేత కార్మికుల నడ్డి విరిచారు.

- చేనేతలకు చేయిచ్చిన చంద్రబాబు
- 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఊసే లేదు
- ఎన్నికల హామీకి ఎగనామం పెట్టిన బాబు
- పెరిగిన విద్యుత్ చార్జీలతో చతికిలబడ్డ వస్త్ర రంగం
- గత ప్రభుత్వంలో నేతన్న నేస్తం పేరిట రూ.24 వేలు ఇచ్చిన జగనన్న



'ఇప్పుడు నేను హామీ ఇస్తున్నా.. చేనేత కార్మికులకు 500 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తా.. మాట నిలబెట్టు కొంటా.. ఎప్పుడు బాబు మాటంటే మాటే.. మాట మీదుంటా .. చేనేత కార్మికులను ఆదుకుంటానని మీకు తెలియజేసుకొంటున్నా!... నాటి ప్రతిపక్ష నేతగా, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గత సార్వత్రికల ఎన్నికల సమయంలో పుత్తూరు బహిరంగ సభలో ఇచ్చిన హామీ ఇదీ!'.

పుత్తూరు : వ్యవసాయం తర్వాత చేనేత రంగం అతిపెద్ద రెండవ ఉపాధి రంగం. చేనేత కార్మికులు తమ నైపుణ్యంతో తలమానికంగా నిలుస్తున్నారు. దేశ మొత్తం మీద వస్త్ర ఉత్పత్తిలో 18 శాతం చేనేత రంగం ద్వారానే తయారవుతోంది. 10 శాతం చేనేత ఉత్పత్తులు ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇంత ప్రాముఖ్యం కలిగిన చేనేత రంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో ఈ రంగం మనుగడే ప్రశ్నార్థంగా మారుతోంది. నూలు వస్త్రాల తయారీలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. నగరి, మదనపల్లి, సత్యవేడు నియోజకవర్గాల్లో వేల సంఖ్యల్లో చేనేత కార్మికులు ఉన్నారు. కాలక్రమంలో చేనేతలు మరమగ్గాలపైన వస్త్రాల తయారీకి మొగ్గు చూపారు. దేశంలోనే మరమగ్గాల వినియోగంలో గుజరాత్ తర్వాత స్థానం మన రాష్ట్రానికే దక్కింది. యూరప్, యునైటెడ్ స్టేట్స్, జపాన్ వంటి దేశాలకు నగరి నుంచి చొక్కాలు, చుడీదార్‌లు వంటి వివిధ రకాల దుస్తులు ఎగుమతి అవుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలోనే చేనేత, మరమగ్గాలను నమ్ముకొని కొన్ని వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. అందుకే ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఏ పార్టీ నాయకులైనా ఇక్కడి కార్మికులను ఆకట్టుకొనే విధంగా హామీలు గుప్పిస్తుంటారు. ఆపై హామీలను నెరవేర్చడంలో మీనమేషాలు లెక్కిస్తుంటారు. ఈ రీతినే గత ఏడాది జరిగిన రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ అధ్యక్షుడుగా, ప్రతిపక్ష నాయకుడి హోదాలో నారా చంద్రబాబునాయుడు పుత్తూరులో పర్యటించారు. ఆ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ చేనేత, పవర్‌లూమ్స్ కార్మికులకు 500 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తానంటూ హామీ ఇచ్చారు. దీనిని గుడ్డిగా నమ్మిన నగరి నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికులు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చలేదు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందాన విద్యుత్ చార్జీల పెంపుతో కార్మికుల వీపులు విమాన మోత మోగుతున్నాయి. దీంతో ఉచిత విద్యుత్ దేవుడెరుగు ఈ బాదుడేంది బాబూ!.. అంటూ కార్మికులు అల్లాడిపోతున్నారు.

చేనేత కార్మికుల ఆందోళన
రాష్ట్ర వ్యాప్తంగా నూలు, పట్టు చేనేత మగ్గాలు 2.79 లక్షలు ఉండగా, 81 వేల పవర్‌లూమ్స్ మగ్గాలు ఉన్నాయి. వీటిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 లక్షల మంది నేత కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. ఒక్క నగరి నియోజకవర్గంలోనే 15 వేల కుటుంబాలకు చెందిన 48 వేల మంది ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఎప్పటి నుంచో రాష్ట్రంలో 15 వేల సబ్సిడీ విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. ఇందులో ఒక్క నగరిలోనే 7,500 సర్వీసులు ఉన్నాయి. వీరికి వాడిన విద్యుత్ యూనిట్లలో 50 శాతం నగదు రాయితీ పొందుతున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా 500 యూనిట్ల వరకు పూర్తి ఉచిత విద్యుత్ ఇస్తామని నమ్మబలికారు. ఇది మనకు ఎంతో లాభదాయకమని నమ్మిన కార్మికులు గంపగుత్తగా ఓట్లు వేసి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు. అయితే గెలిచిన తర్వాత చంద్రబాబు మాత్రం యథావిధిగా మాట తప్పి తన నైజాన్ని మరోసారి చాటుకున్నారు.



విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ బిల్లులను తగలబెడుతున్న దృశ్యం (ఫైల్)

ఉచిత విద్యుత్ కోసం పోరాడుతున్నాం



చేనేత రంగానికి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని పోరాడుతున్నాం. పొరుగు రాష్ట్రం తమిళనాడులో 15 ఏళ్లుగా ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఉచిత విద్యుత్‌పై చేనేతలను ఆదుకొంటానని గట్టిగా చెప్పారు. అయితే నెలలు గడిచిపోతున్నా పట్టించుకోవడం లేదు. ఉచితం ఇవ్వకపోగా ఎఫ్‌పీపీసీఏ అనే కొత్తరకం చార్జీలు వేసి నేతన్నల నడ్డివిరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం నేత పరిశ్రమను ఆదుకునే చర్యలు చేపట్టాలి.

– ఎ.ఎస్.పెరుమాళ్, సీఐటీయూ నేషనల్ కోర్డినేటర్, టెక్స్‌టైల్స్, పవర్‌లూమ్స్ వర్కర్స్ యూనియన్

జీఎస్టీ నుంచి మినహాయించాలి



చేనేత రంగాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర బడ్జెట్‌లో 10 శాతం కేటాయించాలి. అలాగే జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలి. చేనేత కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలి. చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలి.

– వాసు, అధ్యక్షుడు, రాష్ట్ర చేనేత కార్మికుల యూనియన్

విద్యుత్ చార్జీలు పెంచేశారు..



నాకు 10 మరమగ్గాలు, మూడు విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తానని చంద్రబాబు పుత్తూరు సభలో ప్రకటించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు అవుతున్నా ఉచిత విద్యుత్ ఊసే ఎత్తడం లేదు. పైగా యూజర్స్ పేరిట విద్యుత్ చార్జీలు పెంచేశారు. నాకు ఒక్కో సర్వీసుపై రూ. 200 నుంచి 250 వరకు పెరిగింది. మొత్తం నాకు నెలకు రూ.750 పెరిగింది.

– ఎం.ఎస్.తిరువాకరసు, అధ్యక్షుడు, సెంగుంధర్ మక్కల్ నల సంఘం, పుత్తూరు

ఉచిత విద్యుత్ హామీ నెరవేర్చాలి



నాకు రెండు మరమగ్గాలు ఉన్నాయి. నా కుటుంబం దీని మీదే ఆధారపడి జీవిస్తోంది. ఎన్నికల సమయంలో పుత్తూరుకు వచ్చిన చంద్రబాబు, లోకేష్.. 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు నెరవేర్చలేదు. పైగా వివిధ పన్నుల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచేశారు. ఇది మాకు చాలా ఇబ్బందికరంగా ఉంది. ఇకనైనా ఉచిత విద్యుత్ ఇచ్చి, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి.

– ఎం.ఎం.అనిత, పుత్తూరు

రాష్ట్రంలో చేనేత రంగం వివరాలు..

నూలు, పట్టు చేనేత మగ్గాలు	2,79,000
మరమగ్గాలు	81,000
చేనేత ఉత్పత్తి, విక్రయ సహకార సంఘాలు	1,282
ప్రత్యక్ష, పరోక్షంగా ఆధారపడిన కార్మికులు	10 లక్షలు
2024–25 రాష్ట్ర బడ్జెట్	2,94,427 కోట్లు
చేనేత రంగానికి కేటాయింపు	193 కోట్లు
తమిళనాడు రాష్ట్రంలో చేనేతకు ఉచితంగా ఇస్తున్న విద్యుత్ యూనిట్లు 500	ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇస్తున్న యూనిట్లు 0

చేనేత సమస్యలు - డిమాండ్లు
- చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలి
- మొత్తం రాష్ట్ర బడ్జెట్ నుంచి 10 శాతం 3,000 కోట్లు కేటాయించాలి
- నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలి
- చేనేత వస్త్ర ఉత్పత్తులకు జీరో జీఎస్టీని వర్తింపజేయాలి
- నూలు, సిల్క్‌లకు 50 శాతం రాయితీ ఇవ్వాలి
- చేనేత కుటుంబాలకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందించాలి
- గృహం, వర్క్ షెడ్ పథకాన్ని అమలు చేయాలి
- జీవిత బీమా సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసిన బీమా పథకాన్ని కొనసాగించాలి

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక
చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంకు అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారి పై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్
చిత్తూరు అర్బన్ : చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి స్పందన జరుగుతుందని, ప్రజల ఫిర్యాదులు స్పందనలో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల వేదిక
చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి



ప్రచారం చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ వినియోగదారులపై వేస్తున్న ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని విద్యుత్ వినియోగదారుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కన్నన్ కళాశాల సమీపంలో కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు చైతన్య, సురేంద్ర నాథ్ మాట్లాడారు. ఎన్నికలప్పుడు టీడీపీ ఇచ్చిన విద్యుత్ హామీలను నెరవేర్చాలన్నారు. ప్రీపెయిడ్ మీటర్లను వినియోగదారులకు బిగించరాదన్నారు. గతంలో వాడిన కరెంటుకు ప్రస్తుతం బిల్లుల నందు అదనంగా వడ్డించడం సరికాదన్నారు. గతంలో బాదుడే బాదుడు పేరుతో టీడీపీ స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించిందన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే మీటర్లు బిగించుకోవాలని చెప్పడం దారుణమని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని వివరించారు.

రేపు గణిత ప్రజ్ఞాధారణ
చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని సుందరాజపురం వద్ద ఉన్న విజయం ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 18వ తేదీన గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం ఏపీ మ్యాథ్స్ ఫోరమ్ సమన్వయ కర్త అరుణశివప్రసాద్ విలేకరులతో మాట్లాడారు. 18వ తేదీన బంగారపాళ్యం మండలం జెడ్పీ హైస్కూల్ మంగళపల్లి విద్యార్థులతో కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమం సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. మంగళపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు హేమ, లహరి, పునీత్‌సాయి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల సమయాన్ని మార్పు చేయాలి



హేమచంద్రారెడ్డి,ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి

కార్వేటినగరం : క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు కేటాయించిన సమయాన్ని మార్చాలని రాష్ట్ర ఎస్టీయూ కార్యదర్శి హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహిస్తున్న క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల ఉపాధ్యాయులకు అనుగుణంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు బస్సు సౌకర్య లేనటువంటి ప్రాంతాల్లోనూ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సీనియర్ ఉపాధ్యాయులు, అలాగే దివ్యాంగ ఉపాధ్యాయులకు ఇది ప్రమాదకరమన్నారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులు ఉదయం 5గంటలకు బయలు దేరిన వారికి ఫోన్ చార్జింగ్ లేక అటెండెన్స్ ఇబ్బందులు ఎదురై అవకాశం ఉందన్నారు. పాఠశాల సమయం నాలుగు గంటలకు ముగించాల్సి ఉండగా కాంప్లెక్స్ సమావేశాల పేరుతో ఐదున్నర గంటల వరకు పెంచడం దారుణమన్నారు. క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల పేరుతో ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్షసాధింపునకు దిగుతోందని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నాలుగు గంటలకే ముగిసే విధంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

పర్మినెంట్ కిక్కు

మద్యం దుకాణాలలో ఎక్కడా పర్మిట్ గదులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. కానీ జిల్లాలో పట్టణం నుంచి పల్లె వరకు మద్యం దుకాణాల్లో అనధికారిక పర్మిట్ గదులు యథేచ్ఛగా సాగుతున్నాయి. వీటిని దక్కించుకున్న కూటమి నేతలు బార్లను తలదన్నేలా పర్మిట్ గదులు పెట్టి డబ్బులు దోచుకుంటున్నారు. ఇంత బాహాటంగా జరుగుతున్న ఈ అక్రమాలను పర్యవేక్షించాల్సిన ఎక్సైజ్, పోలీసులు ఎవరి వాటాలు వారు తీసుకొని ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే ఇక బెదిరింపులు, దాడులు, కేసులు వెంటాడుతాయి. ఇది ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోని మద్యం దుకాణాల పరిస్థితి.



జిల్లాలోని మద్యం దుకాణాలు -	104
అనుమతిలేని పర్మిట్ గదులు -	350
మద్యం విక్రయాలు (నెలకు) -	రూ.116.20 కోట్లు
పర్మిట్ గదుల్లో వ్యాపారం (నెలకు) -	రూ.10.50 కోట్లు
మొత్తంగా వచ్చే లాభాలు (నెలకు) -	రూ.18.46 కోట్లు
అధికారులకు ఇస్తున్న మామూళ్లు -	రూ.52 లక్షలు
కూటమి నేతలకు ఇచ్చే వాటా -	రూ.8.12 కోట్లు

- మద్యం దుకాణాల్లో అనధికార పర్మిట్ గదులు
- బార్లకు సమాంతరంగా మద్యం దుకాణాల గదులు
- 'పర్మిట్' ఆదాయంలో ఎక్సైజ్, ఖాకీలకు వాటాలు
- ఆపై కూటమి నేతలకు నగటున 7 శాతం మామూళ్లు
- నగరి నుంచి కుప్పం వరకు 'మద్యం' గదుల్లో దందా



చిత్తూరు పాత బస్టాండు సమీపంలోని ఓ మద్యం దుకాణంలోని పర్మిట్ గదులు



విజయపురంలోని మహారాజపురం వద్ద మద్యం పర్మిట్ గది వద్ద కిక్కిరిసిన మందు బాబులు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరం ఒక్కటే కాదు.. జిల్లాలోని తమిళనాడు సరిహద్దులో ఉన్న నగరి నుంచి కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న కుప్పం నియోజకవర్గం వరకు ప్రతి ఒక్క మద్యం దుకాణం వద్ద పర్మిట్ గదులు దర్శనమిస్తుంటాయి. వీటికి ఏవైనా అనుమతులు ఉన్నాయా..? రాష్ట్రంలో అసలు పర్మిట్ గదులు పెట్టుకోవడానికి అనుమతులే ఇవ్వలేదు. అనధికారికంగా బార్లకు సమాంతరంగా మద్యం దుకాణాల వద్దే పర్మిట్ గదులు కనిపిస్తున్నాయి. ఈ పర్మిట్ గదులే కూటమి నేతల నుంచి ఎక్సైజ్, పోలీసు అధికారులకు మామూళ్ల వర్షం కురిపిస్తున్నాయి.

ఆదాయం ఇలా..
చిత్తూరు నగరం, పలమనేరు, నగరి, కుప్పం పట్టణాల్లోని మద్యం దుకాణాల వద్ద ఒక్కో పర్మిట్ గది వద్ద రోజుకు సగటున రూ.30 వేల వరకు వ్యాపారం జరుగుతోంది. మద్యం తాగే డిస్పోజబుల్ గ్లాసు నుంచి మాంసాహార వంటలు, కూల్ డ్రింకులు, టిఫెన్లు అన్నీ ఇక్కడే లభ్యమవుతున్నాయి. పల్లెల్లో ఉన్న పర్మిట్ గదుల్లో సగటున రూ.10 వేల వరకు వ్యాపారం జరుగుతోంది. జిల్లా మొత్తంగా ఉన్న మద్యం దుకాణాల వద్ద 350 వరకు పర్మిట్ గదులు ఉంటే.. మద్యం విక్రయాలు, గదుల్లో జరిగే వ్యాపారాల ద్వారా నెలకు దాదాపు రూ.18 కోట్లకు పైనే లాభాలు వస్తున్నాయి.

'చిత్తూరు నగరంలోని పాత బస్టాండు సమీపంలో ఉన్న మద్యం దుకాణం. ఈ దుకాణం మిద్దె పైన పర్మిట్ గది నడుస్తోంది. దీనికి మూడు పక్కల ఉన్న దుకాణాల్లో ఎక్కడైనా సరే కూర్చుని మద్యం తాగే వెలుసుబాటు ఉంది. స్టఫ్‌కు ఏది కావాలంటే అది నిమిషాల్లో తయారు చేసి ఇస్తారు. రోజుకు రూ.30 వేల ఆదాయం సమకూరుస్తున్న అనధికారిక పర్మిట్ గదుల విషయం జిల్లా ఎక్సైజ్ అధికారుల నుంచి కాని స్టేబుల్ వరకు తెలుసు. చర్యలు తీసుకోరా..? అంటే మౌనమే సమాధానం.'

ఎవరి వాటా వాళ్లదే..
పర్మిట్ గదులు వెలసినచోట.. మరే వ్యాపారం చేయడానికి వీలుండదు. వస్త్ర దుకాణాలు, హోటళ్లు, పానీపూరి దుకాణాల్లాంటి వాటిని ఇక్కడ కొనసాగించే ప్రసక్తే లేదు. మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు నిత్యం గొడవలు పడటం, తాగి అక్కడే వాంతులు చేసుకోవడం, పడిపోవడం సర్వ సాధారణం. ప్రతి పర్మిట్ గదికి ఎక్సైజ్, ఖాకీలు కప్పం వసూలు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఒక్కో దుకాణానికి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ మొత్తం ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత మద్యం దుకాణ నిర్వాహకుడిదే. వచ్చిన దాంట్లో ఎక్సైజ్ అధికారులు ఒక్కో దుకాణానికి రూ.30 వేలు, పోలీసులు రూ.20 వేల వరకు పంచుకుంటున్నారు. పల్లెల్లోని దుకాణాలకు కాస్త మినహాయింపు ఇస్తూ రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నారు.

కూటమి నేతను చేర్చుకోవాల్సిందే..
మద్యం దుకాణాలున్న నియోజకవర్గంలో వాటి యజమానులకు ఇష్టం ఉన్నా లేకున్నా కూటమి పార్టీ నేతలను వాటాదారుడిగా చేర్చుకోవాల్సిందే. వ్యాపారంలో ఎలాంటి పెట్టుబడి పెట్టని కూటమి నేతలు 5 నుంచి 7 శాతం వరకు.. అంటే నెలకు రూ.8 కోట్ల పైనే లాభాలు ఆర్జిస్తున్నారు. ఆ మాత్రం కిక్కులేకుంటే కష్టమే మరి.

పోస్టాఫీస్‌లో ఉద్యోగాలు
- డివిజన్ పరిధిలో 54 ఖాళీలు
- ప్రతిభకు ప్రాధాన్యం

చిత్తూరు కార్పొరేషన్ : తపాలా కొలువుల భర్తీకి ఆ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఖాళీల భర్తీలో భాగంగా ప్రతిభ ఆధారంగా ఉద్యోగులను ఎంపిక చేయనున్నారు. బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ (బీపీఎం), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ (ఏబీపీఎం), గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్)లను పదో తరగతిలో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా ఈ నియామకాలు చేపట్టనున్నారు.

ఖాళీల వివరాలు ఇలా
డివిజన్ పరిధిలో మొత్తం 54 పోస్టులను భర్తీ చేయనున్నారు. చిత్తూరు హెచ్ఓ-3, మిట్టూరు బీఓ, మురకంబట్టు, తుమ్మిందపాళ్యం, వరత్తూరు, వెంగనపల్లె, గుడిపాల, నంగమంగళం, నరహరిపేట, బైరుపల్లి, బసినికొండ, బేలుపల్లి, బురకాయలకోట, చెల్దిగానిపల్లి, చెరుకువారిపల్లి, చౌడేపల్లి ఎస్‌వో-2, దేవళచెరువు, ఈడిగపల్లి, గొల్లపల్లి, గొల్లపల్లి బీఆరేకే, గుడుపల్లె, ఐరాల, కడపనత్తం, కగతి, కనమనపల్లి, కట్టకిందపల్లి, కీరమంద, కోసువారిపల్లి, మదనపల్లి హెచ్ఓ-3, మద్దినాయనిపల్లి, మల్లన్ ఆర్ఎస్, మందిపెట్టూరు, ముదివేడు, ముసలికుంట, ముస్తూరు, ముత్తుకూరు, నరసింహాపురం, నెలవాయి, బద్దేపల్లె, పల్లికుప్పం, పట్నం, పెద్దబంగారునత్తం, పెద్దచెల్లారగుంట, పీటీఎం, రిషివ్యాలీ, రాయల్‌పేట, సింహరాజపురం, ఎద్దులవారిపల్లె, ఎర్రేపల్లె బీఓలు ఖాళీగా ఉన్నాయి.

అర్హతలు ఇవీ..
పదో తరగతి ఉత్తీర్ణులై వయస్సు 18–40 ఏళ్ల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయో పరిమితి ఉంది. దీని కోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఇండియా పోస్ట్ జీడీఎస్ వెబ్‌సైట్‌లో మార్చి 3 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. అధికారులు అన్నింటిని పరిశీలించి తుది జాబితాను ప్రకటించనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తపాలాశాఖ సూపరింటెండెంట్ లక్ష్మణ్ వివరించారు.

క్లుప్తంగా

రైల్వే క్రాసింగ్ వద్ద ఇరుక్కున్న లారీ



మరాలిగేట్ తండవాలం వద్ద లారీ ఇలా..


పుత్తూరు : స్థానిక మరాలిగేట్ రైల్వే క్రాసింగ్ వద్ద ఆదివారం ఓ భారీ వాహనం ఇరుక్కుపోయింది. గూడ్స్ క్యారియర్ లారీ పుత్తూరు నుంచి నగరి వైపు వెళ్తుండగా ఈ సంఘటన చోటు చేసుకొంది. రైల్వే క్రాసింగ్ వద్ద ఏర్పాటు చేసిన తొలి ఎత్తు నియంత్రణ తండ వాలాన్ని దాటుకున్న లారీ రెండవ తండ వాలం వద్ద ఇరుక్కుపోయింది. దీంతో అర గంట పాటు రాకపోకలు స్తంభించాయి. రైల్వే సిబ్బంది అప్రమత్తమై లారీ టైర్లలోని గాలిని తగ్గించడం ద్వారా లారీ ఎత్తు తగ్గి వాహనం ముందుకు సాగింది. దీంతో రాకపోకలు సాగాయి. లారీ డ్రైవర్‌ను స్థానిక రైల్వే పోలీసులు విచారిస్తున్నారు.

ఏడు పశువులు చోరీ

తవణంపల్లె: మండలంలోని నాలుగు గ్రామాల్లో శనివారం రాత్రి ఏడు పశువులు చోరీకి గురైనట్లు తవణంపల్లె పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. బాధితుల కథనం.. మండలంలోని తడకర, మిట్టపల్లె, ఎగువ తవణంపల్లె, తవణంపల్లెలో ఇంటి దగ్గర కట్టేసి ఉన్న ఏడు పశువులను దొంగలు చాకచక్యంగా అపహరించారు. దీనిపై బాధితులు తవణంపల్లె పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భయపెడుతున్న జీబీఎస్ వైరస్

- కబళిస్తున్న మహమ్మారి
- కేసుల నమోదుతో ఆందోళన
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్య నిపుణులు



చిత్తూరు రూరల్ (కాణిపాకం) : అరుదుగా వచ్చే జీబీఎస్ (గులియన్‌బారె సిండ్రోమ్) తీవ్రత గతంలో పరిమితంగా ఉండేది. అనేక కారణాలతో ఈ వ్యాధి పీడితుల సంఖ్య రాష్ట్రంలో పెరుగుతోంది. గుంటూరు, విశాఖపట్నం, కాకినాడ జిల్లాలో పలు కేసులు బయటపడ్డాయి. అన్ని వయసుల వారిని మహమ్మారి కబళిస్తోంది.

జీబీఎస్ లక్షణాలను ఓ పట్టాన అర్థం చేసుకోలేరు. పైకి ఆరోగ్యంగానే ఉంటారు. వైద్య పరీక్షల ఫలితాలు సాధారణంగానే కనిపిస్తాయి. కానీ క్రమంగా బలహీనపడతారు. ఓ దశలో అచేతనంగా మారిపోతారు. కాళ్లు, చేతులు, మెడ కండరాలతో పాటు..ఒకోసారి తలలోని కండరాలు చైతన్యాన్ని కోల్పోతాయి. రెప్పవాల్చలేని దుస్థితికి చేరతారు. జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులుహెచ్చరిస్తున్నారు.

జిల్లాలో నరాల బలహీనత, సమస్యతో బాధపడే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ ఆస్పత్రులకు ఓపీల సంఖ్య అధికమవుతోంది. చాలా మంది నరాల బలహీనతపై అలసత్వం వహిస్తుంటారు. ఇంటి వద్దే పలు రకాల నూనెలు పూస్తూ.. ఉండిపోతున్నారు. మరికొంత మంది నరాలు లాగేసిందని బలహీనమని, పక్షవాతమని నాటు మందులు తినేందుకు క్యూ కడుతున్నారు. చాలా మంది చేతబడి చేశారని.. నమ్ముతున్నారు. ఇలా చేయడం ద్వారా నరాల సమస్య పెరిగి ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో ఈజీబీఎస్‌పై కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

వ్యాప్తి ప్రభావం ఇలా..

చలికాలం నుంచి ఎండాకాలానికి, ఎండాకాలం నుంచి వర్షాకాలానికి.. సరిగ్గా రుతువు మారిన సమయంలో గులియన్ బారె సిండ్రోమ్ వచ్చే ఆస్కారం ఎక్కువ. కానీ సీజన్ మారినప్పుడు ఆ తీవ్రత మరింత అధికం అవుతుంది. జీబీఎస్ నేరుగా రోగి నరాలపై ప్రభావం చూపుతుంది. నరాలు మన శరీరంలోని వివిధ అవయవాలకు మధ్య విద్యుత్ తీగల్లా పనిచేస్తాయి. కనెక్టివిటీ ఇస్తాయి. ఎప్పుడైతే ఈ నరాలు దెబ్బతింటాయో.. విద్యుత్ ప్రసరణలో అంతరాయం ఏర్పడుతుంది. ఫలితంగా ఆయా అవయవాలు మొరాయిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే.. జీబీఎస్ అనేది ఒక రకమైన నరాల వ్యాధి. మనిషిలోని ప్రతి అవయవాన్ని మెదడు నియంత్రిస్తుంది.. అయితే ఈ నరాలన్నిటిపైన ×మైలిన్‌¤ అనే పొర ఉంటుంది. కానీ, మైలిన్ పొర దెబ్బతిన్నప్పుడు ఎలక్ట్రికల్ సిగ్నల్స్ నిలిచిపోతాయి. ఫలితంగా నరాలు దెబ్బతిని అవయవాలు పనిచేయడం మానేస్తాయి.

నిర్లక్ష్యం చేస్తే...


వ్యాధిని మరింత నిర్లక్ష్యం చేస్తే ఛాతీ కండరాలు, ఊపిరి తిత్తులను పనిచేయించే డయాఫ్రమ్ కండరాలు ప్రభావితం అవుతాయి. దాంతో ఊపిరితీసుకోవడం కష్టమవుతుంది. సరిగ్గా శ్వాస తీసుకోకపోతే రోగి పరిస్థితి విషమించే ప్రమాదం ఉంది. అప్పుడు, వెంటిలేటర్ అవసరం అవుతుంది. దీంతోపాటు గొంతు కండరాలు సైతం ప్రభావితం అవుతాయి. మాట్లాడటం, మింగడం కష్టమవుతుంది. రోగి చాలా ఇబ్బంది పడతారు.

ఎక్కువగా వీరిలోనే...

జీబీఎస్ అన్ని వయసుల వారినీ వేధిస్తుంది. కానీ ఎక్కువగా 25–45 ఏళ్ల లోపు వారికి, 50–65 ఏళ్ల లోపు వారిని లక్ష్యంగా పెట్టుకుంటుంది. డయేరియా, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్‌లకు గురైనప్పుడు.. సమస్య వచ్చిపోయిన రెండు నుంచి నాలుగు వారాల తరువాత జీబీఎస్ దాడిచేసే అవకాశాలు ఉంటాయి. మహిళలతో పోలిస్తే పురుషుల్లో సమస్య కొంత ఎక్కువగా ఉంటుంది. మగవాళ్లు ఎక్కువగా బయట తిరగడం, తరచూ ఇన్‌ఫెక్షన్‌లకు గురి కావడమే దీనికి కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ముందస్తు నివారణ చర్యలు

- కాచి వడబోసిన నీరు తాగడం
- పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడగడం
- మాంసం 100 డిగ్రీల్లో ఉడికించి తినాలి
- మలవిసర్జన ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడ్కుకోవాలి
- మొత్తానికి పరిశుభ్రంగా ఉండాలి



జిల్లా సమాచారం..

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి –	1
ఏరియా ఆస్పత్రులు –	4
సీహెచ్‌సీలు –	8
పీహెచ్‌సీలు –	50
అర్బన్ హెల్త్ సెంటర్లు –	15
ప్రైవేటు ఆస్పత్రులు –	1500

లక్షణాలు ఇలా...

- తీవ్ర బలహీనత
- కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు
- ఒళ్లంతా మొద్దుబారడం
- మెడ, ముఖం కండరాలు బలహీనపడటం
- ఆహారం నమలడంలో ఇబ్బంది
- కళ్లు తెరవడంలో సమస్యలు
- ఊపిరి తీసుకోలేకపోవడం
- ఆహారం మింగలేరు, మెడ కదపలేరు
- లేచి నిల్చోలేకపోవడం
- మల విసర్జన చేయలేకపోవడం
- గుండెపోటుతో పాటు బీపీ పెరగడం
- మూత్ర విసర్జన వ్యవస్థపై నియంత్రణ కోల్పోవడం
- నిటారుగా నిలబడలేకపోవడం

సకాలంలో వైద్యం చేయించుకోవాలి



కాళ్లల్లో బలం తగ్గపోయినా వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. జీబీఎస్ తీవ్రతరం అయితే శ్వాస సమస్య తలెత్తుతుంది. అప్పుడు, మెకానికల్ వెంటిలేటర్ పెట్టాల్సి ఉంటుంది. మెకానికల్ వెంటిలేటర్‌తో ఇన్‌ఫెక్షన్స్ వచ్చే అవకాశాలు ఎక్కువ. వెంటిలేటర్‌పై ఉండటం వల్ల కదలికలు ఆగిపోయి కాళ్లలో రక్తం గడ్డ కడుతుంది. గుండెపై ప్రభావం పడుతుంది. గుండె పనితీరు హెచ్చుతగ్గులు ఉంటాయి. ఇన్‌ఫెక్సన్‌లు రక్తంలోకి చేరుతోంది. సకాలంలో గుర్తించి వైద్యం చేయించుకోవాలి. మూఢ నమ్మకాల జోలికి వెళ్లవద్దు. జ్వరం వస్తే కూడా తేలికగా తీసుకోవద్దు. – కల్యాణ్, న్యూరో సర్జన్, చిత్తూరు

వృద్ధుడి ఆత్మహత్య



మృతి చెందిన వెంకటరమణప్ప

గంగవరం : అనారోగ్య సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని మర్రిమాకులపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణప్ప (61) కూలి పనులతో జీవనాధారం. ఆయన కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. అప్పుడప్పుడూ తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నాడు. మనస్తాపం చెంది ఉదయం పొలం వద్దకు వెళ్లి జిల్లేడుపాలు తాగాడు. గమనించిన స్థానికులు వృద్ధుడి చికిత్స కోసం పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ తగాదాతో దాడి

– నిల్వ కొయ్యలకు నిప్పు పెట్టిన వైనం



నిప్పు పెట్టడంతో కాలుతున్న కొయ్య సామగ్రి

చౌడేపల్లె : భూ తగాదా విషయమై పాత కక్షలతో తనపై దాడి చేశారని మొరంకిందపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు వివరాలు.. గ్రామానికి సమీపంలోని భూముల్లో వెంకట రమణారెడ్డి టమాటా పంట సాగు చేయడానికి ఏర్పాట్లు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన మునస్వామి, సుబ్రమణ్యం, బాలకృష్ణ తనపై దౌర్జన్యం చేసి, దాడికి తెగబడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా తన పొలంలో సుమారు రూ.లక్ష విలువ చేసే టమాటా సాగు కోసం నిల్వ చేసిన కట్టెలకు నిప్పంటించినట్లు తెలిపారు. తనతో పాటు తన కుటుంబానికి వీరి వలన ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని పోలీసులకు వెంకట రమణారెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జిల్లాకు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు జిల్లా కేంద్రానికి చేరాయి. రాష్ట్ర విద్యాశాఖ నుంచి ప్రత్యేక వాహనంలో పకడ్బందీ బందోబస్తు నడుమ ప్రశ్నపత్రాలను జిల్లా కేంద్రానికి పంపారు. వీటిని జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. స్ట్రాంగ్‌రూం వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా మార్చి 1 నుంచి ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రస్తుతం జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

హాజరుకానున్న 30,713 మంది విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా 139 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుంచి 30,713 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రథమ సంవత్సరంలో 15,639, ద్వితీయ సంవత్సరంలో 15,074 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష పత్రాలను 24, 25 తేదీల్లో ప్రత్యేక పోలీసు బందోబస్తు నడుమ జిల్లాలోని మండలాలకు సరఫరా చేయనున్నారు.

పర్యవేక్షించిన అధికారులు

జిల్లాకు చేరిన ప్రశ్నపత్రాలను అధికారులు పర్యవేక్షించారు. ఈ ప్రక్రియను ఇంటర్మీడియెట్ డీవీఈవో సయ్యద్ మౌలా, డీఎస్పీ సాయినాథ్ పీసీఆర్ జూనియర్ కళాశాలలో ప్రక్రియను పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూం వద్ద సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ హేమలత, దయానందరాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఆదివారం జిల్లా కేంద్రానికి మొదటి సెట్ ఇంటర్ ప్రశ్నపత్రాలు విచ్చేశాయి. వాటిని పకడ్బందీగా భద్రపరిచాం.

– సయ్యద్ మౌలా, ఇంటర్మీడియట్ డీవీఈఓ.

బైక్‌లు ఎదురెదురుగా ఢీ

– ఘటనా స్థలంలోనే ఇద్దరు మృతి



ప్రమాదంలో మృతి చెందిన ప్రదీప్, ఉమేష్

గంగవరం : రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన గంగవరం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. అర్బన్ సీఐ ప్రసాద్ కథనం మేరకు.. పెద్ద పంజాణి మండలం శివాడి గ్రామానికి చెందిన ప్రదీప్ (30) శంకర్రాయలపేట గ్రామంలో దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో కొనుగోలుదారుల నుంచి బాకీ వసూళ్ల కోసం బుల్లెట్ వాహనంలో నాలుగు రోడ్ల కూడలికి బయలుదేరి వెళ్లి అక్కడ పని ముగించుకుని తిరిగి వస్తున్నాడు. అదే విధంగా నాలుగు రోడ్లు వద్ద ఓ ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఉమేష్(31), బెంగుళూరు హోస్‌కోట వద్ద ఓ కంపెనీలో పనిచేస్తున్న అరుణ్(21) ఇద్దరూ అరుణాచలప్రదేశ్‌కి చెందినవారు. ఉమేష్‌ని కలుసుకోవడం కోసం అరుణ్ బెంగుళూరు నుంచి రాగా ఇద్దరూ కలిసి పల్సర్ బైక్‌లో ఎక్కడికో వెళ్లి తిరిగి నాలుగురోడ్ల కూడలి వద్దకు వస్తున్నారు. ఈ క్రమంలో రెండు వాహనాలు వేగంగా వస్తూ సరమట్లపల్లి గ్రామం వద్ద ఒకదానికొకటి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బుల్లెట్‌లో వెళ్తున్న ప్రతాప్, అరుణాచలప్రదేశ్‌కు చెందిన ఉమేష్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందగా అరుణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు సీఐ, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం హుటాహుటిన పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరిన పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

కూటమిలో కుంపటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్, సభ ప్రాంగణంలో జనసేన జెండాలకే ప్రాధాన్యం

– మరోసారి బయటపడ్డ వర్గపోరు

శ్రీరంగరాజపురం : గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని కూటమి పార్టీలో మరొసారి వర్గపోరు బట్టబయలు అయింది. ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు ప్రభుత్వ విప్ పదవి కేటాయించడంతో మండలంలోని పుల్లూరు గ్రామంలో జనసేన తరపున సన్మాన సభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ రాజేంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు, నాయకులు ఆహ్వానం లేకపోవడంతో పాల్గొనలేదు. ఎటుచూసిన జనసేన జెండాలు దర్శనమిచ్చాయి, టీడీపీ, బీజేపీ జెండాలు కనిపించకపోవడంతో అక్కడికి వచ్చిన కార్యకర్తలు అసహనంతో వెనుతిరిగారు. స్థానిక ఎమ్మెల్యేకు సమస్యలకు తెలియజేయాలన్నా వాట్సాప్‌లోనే తెలియజేయాలని ఎమ్మెల్యే అనడంతో అక్కడికి వచ్చిన ప్రజలు ఖంగుతున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ అన్నారు. అనంతరం జనసేన ఇన్‌చార్జ్ డాక్టర్ యుగంధర్‌పొన్న ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ భవ్య, మండల జనసేన అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు గుండయ్య, పవన్, మురళీమోహన్, కుప్పయ్య, సుమన్, చంద్రమౌళి, రాఘవ పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యుడికి నివాళి



సదుం : నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథ రెడ్డి

సదుం : అస్వస్థతతో మృతి చెందిన ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆనంద మృతదేహానికి ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథ రెడ్డి ఆదివారం నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే బయ్యారెడ్డిగారిపల్లెలో మృతి చెందిన సంతోష్ (23) మృతదేహానికి నివాళి అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ధనుంజరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, నాయకులు బాబురెడ్డి, ఇమ్రాన్, పుత్రాజు, చిన్న రమణ, మల్‌రెడ్డి, రామాంజులు, ఎల్లారెడ్డి, వెంకటరమణాచారి, రవి, శివ, భాస్కర్,సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పొట్టింవారిపల్లెలో పార్టీ సీనియర్ నాయకుడు భాస్కర్ రెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పరామర్శించారు.

ఘనంగా సంకటహర చతుర్థి



సంకటహర చతుర్థి వ్రతానికి హాజరైన భక్తులు



కాణిపాకం ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు

కాణిపాకం : స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఆదివారం సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చతుర్థి సందర్భంగా ఉదయం ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు సుగంధ పుష్పాలతో అలంకరణ చేసి.. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ అధికారులు ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆస్థాన మండపంలో కొలువు దీర్చారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతం చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణరథంపై విహారం


స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి రాత్రి ఆలయ మాడ వీధుల్లో స్వర్ణ రథంపై విహరించారు. అలంకార మండపంలో వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు ఆలయ అర్చక, వేద పండితులు ప్రత్యేకంగా అభిషేకాలు జరిపించారు. అనంతరం ఆలయ అధికారులు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామి వారి స్వర్ణ రథంలో కొలువు దీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి స్వర్ణ రథం మంగళ వాయిద్యాలతో మాడ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తుల రద్దీ

కాణిపాక దేవస్థానానికి ఆదివారం పెళ్లికళ సంతరించుకుంది. పలు వివాహాలతో ఆలయానికి వేకువజాము నుంచే భక్తుల తాకిడి మొదలైంది. భక్తులు స్వామి దర్శనార్థం భారీగా క్యూకట్టారు. అలాగే ఆదివారం కావడంతో ఉదయం నుంచి భక్తజన సందడి మరింత అధికమైంది. ఉదయం10 గంటల ప్రాంతంలో సంకటహర చతుర్థి వ్రతం ఉండడంతో భక్తుల రద్దీ పెరిగింది. భక్తుల రాకతో ఆలయం కిటకిటలాడింది. రాత్రి వరకు కూడా ఈ రద్దీ అలానే కొనసాగింది. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు దర్శనభాగ్యం కల్పించారు.

దర్జాగా ప్రభుత్వ భూముల ఆక్రమణ

– పట్టించుకోని రెవెన్యూ అధికారులు



గుట్టను చదును చేసి రోడ్డు వేసిన దృశ్యం

పాలసముద్రం : మండలంలోని వనదుర్గాపురం పంచాయతీ తమిళనాడు సరిహద్దులో ఆదివారం ప్రభుత్వ భూమిని టీడీపీ నేతలు వెనుకుండి తమిళనాడు వాసులతో చదును చేయించారు. తమిళనాడు సరిహద్దులో భూముల ధరలు రూ.లక్షల్లో పలుకుతున్నాయి. ఈ ప్రభుత్వ భూములపై కన్నేసిన కూటమి నేతలు కుట్రకు తెర తీశారు. ప్రభుత్వ భూములను చదును చేయించి తమిళనాడు వాసులకు పట్టాలు ఇప్పించి ముందే వారితో డబ్బులకు మాట్లాడుకొని ఈ తతంగాన్ని నడిపిస్తున్నారు. ఎలాగూ ఇళ్లు నిర్మించుకున్నారని అధికారులకు చెప్పి వారికే పట్టాలు కట్టబెడితే చేతికి మట్టి అంటకుండా పోతుందని భవిష్యత్తు అక్రమాలకు ముందు చూపుతో వ్యవహరించడం కొసమెరుపు. వనదుర్గాపురం గ్రామానికి చెందిన టీడీపీ బడా నాయకుడు అండదండలతోనే ఈ భూ ఆక్రమణ జరుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దుర్మార్గపు ఆలోచనతో చేస్తున్న కూటమి నేతల పన్నాగాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.